క్లుప్తంగా

ముద్రగడ ఆరోగ్యం మెరుగుపడాలని పూజలు



కిర్లంపూడిలోని లక్ష్మీగణపతి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న పద్మావతి

కిర్లంపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర పొలిటికల్ అడ్వైజరీ కమిటీ (పీఏసీ) సభ్యుడు ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం మెరుగుపడాలని కోరుతూ మండలంలోని పలు ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక సంతమార్కెట్‌లో వేంచేసిన లక్ష్మీగణపతి ఆలయంలో ముద్రగడ పద్మనాభం సతీమణి పద్మావతి మృత్యుంజయ, గణపతి, పూర్ణకుంభం హోమాలు నిర్వహించారు. పలువురు పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



బిళ్లనందూరులో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే దివ్య

కోటనందూరు: ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. మండలంలోని బిళ్లనందూరులో సోమవారం ప్రజాదర్బారు నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్వీకరించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం కొత్తకొట్టాంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి ఇంటింటా పర్యటించి ప్రభుత్వ పాలన, సంక్షేమ పథకాలపై అభిప్రాయాలను కోరారు. అంకంరెడ్డి రమేష్, పోతల సూరిబాబు, గాడి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎ.అగ్రహారంలో హిందూధర్మ ప్రచారం

తుని రూరల్: మండలంలోని ఎ.అగ్రహారంలో త్రైత సిద్ధాంత ప్రబోధసేవా సమితి ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం హిందూజ్ఞాన వేదిక ప్రతినిధులు ధర్మ ప్రచారాన్ని గురువారం నిర్వహించారు. జ్ఞానవేదిక ఉపాధ్యక్షుడు శాంతరాజు ఆధ్వర్యంలో ప్రతినిధులు త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథంలో ఉన్న కృష్ణుడి విశిష్టత వివరిస్తూ ఇంటింటా ధర్మ ప్రచారం చేశారు. సభ్యులు జలంధర్, వ్యాస్, సత్యవతి, స్వాతి, నందన, సర్వ, జగన్‌లు పాల్గొన్నారు.

అరుణాచలేశ్వరస్వామికి విశేష పూజలు



అరుణాచలేశ్వరస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లిలో వేంచేసిన అపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. పండితులు స్వామివారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, సామూహిక అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారికి విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శ్రీరమణా సేవాశ్రమం వ్యవస్థాకులు స్వామి రామానంద ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తొండంగి: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జగ్గంపేట విద్యుత్‌శాఖ ఈఈ వీరభద్రరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని బెండపూడి, తమ్మయ్యపేట గ్రామాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు హోమియో మందుల పంపిణీ

తొండంగి: బెండపూడి జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు సోమవారం హోమియో మందులు పంపిణీ చేశారు. పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకూ చదువుతున్న బాలబాలికలకు డెంగీ, మలేరియా వ్యాధులు రాకుండా రావికంపాడు ప్రభుత్వ హోమియో ఆస్పత్రి వైద్యుడు చంద్రశేఖర్ ఉచితంగా హోమియో మాత్రలు అందజేశారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వాటి నివారణకు మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఆకుకూరలతో ఆరోగ్యం

- మెట్టలో ఆసక్తి చూపుతున్న రైతులు
- పోషక విలువలు పుష్కలం
- కొనుగోలుకు మొగ్గు చూపుతున్న ప్రజలు



ప్రత్తిపాడు మండలం రాచపల్లిలో ఆకుకూరల సాగు

ప్రత్తిపాడు: ప్రస్తుతం ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన పెరిగింది. ప్రతిఒక్కరూ పౌష్టికాహారం తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో మాంసాహారం కన్నా ప్రకృతి విధానంలో సాగు చేసిన ఆకుకూరలు, కాయకూరలు తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

ఆకుకూరల్లో విటమిన్లు, లవణాలు, మాంసకృతులు, పీచు పదార్థం మెండుగా ఉంటాయి. దీంతో ఆకు కూరలు వినియోగించేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఆకుకూరలకు డిమాండ్ ఉండటంతో ప్రత్తిపాడు నియోజకవర్గంలో రైతులు ఆకుకూరలు విస్తారంగా సాగు చేస్తున్నారు. గృహిణులు కూడా తమ ఇంటి పెరట్లో తోటకూర, గోంగూర, కొత్తిమీర వంటి ఆకుకూరలు పెంచుతూ ఇంట్లో సొంతానికి వాడుకోవడంతో పాటు అదనంగా ఉన్న వాటిని మార్కెట్‌లో విక్రయించి ఆర్థికంగా లబ్ధిపొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆకుకూరల సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై ఉద్యానవన అధికారిణి కె.దివ్యశ్రీ పలు సూచనలు ఇచ్చారు.

తోటకూర

తోటకూర విత్తనాలు చాలా చిన్నవిగా ఉంటాయి. వీటిని ఇసుకతో కలిసి తయారు చేసుకున్న నేలలో విత్తుకోవాలి. ఎకరానికి 3 నుంచి 4 కేజీల వరకు అవసరం అవుతాయి. 10 కిలోల ఇసుకను కలిపి మడులపై పలచగా చల్లుకోవాలి. దానిపై పలుచని పొరలా మెత్తటి మట్టి లేదా ఇసుకతో కప్పాలి.

కొత్తిమీర

కొత్తిమీర విత్తుకునేటప్పుడు విత్తనాన్ని రెండు బద్దలుగా చేయాలి. లేకపోతే గింజ ఆలస్యంగా మొలకెత్తి మొలక శాతం దెబ్బతింటుంది. దీనికోసం గింజలను నేలపై పోసి సున్నితంగా నేలకేసి కొట్టాలి.

మెంతి కూర

ఇది పప్పు జాతి పంట. మొదటిసారి పొలంలో విత్తే ముందు రైజోబియం కల్చర్‌ను విత్తనాలకు పట్టిస్తే వాతావరణంలోని నత్రజనిని గ్రహించడానికి తోడ్పడుతుంది. దీని ద్వారా మెంతికూర మొక్కల పెరుగుదల బాగుంటుంది.

పాలకూర

పాలకూర విత్తనాలను 3.4 సెంటీ మీటర్ల లోతులో విత్తుకోవాలి. లోతు ఎక్కువైతే మొలక శాతం తగ్గుతుంది. ఎకరానికి నాలుగు లేదా ఐదు కిలోల విత్తనాలు సరిపోతాయి. పాలకూర పంట త్వరగా చేతికందుతుంది.

కరివేపాకు

విత్తనాలను పండు నుంచి వేరు చేసిన వెంటనే నేలలో విత్తుకోవాలి. ఆరిన తరువాత విత్తితే మొలక శాతం బాగా తగ్గిపోతుంది. విత్తిన 48 గంటలలోగా నేలలో పదును చూసుకుని, లీటరు నీటికి నాలుగు లీటర్ల పిండి మిథాలిన్ కలిపి పిచికారీ చేసుకోవాలి. పంట తొలిదశలో కలుపు నివారించుకోవచ్చు.

నేల తయారీ, ఎరువులు

ఆకుకూరల సాగుకు నేల తయారీ చాలా ముఖ్యం. మెత్తటి దుక్కు వచ్చే వరకు లోతు దుక్కితో పాటు 3 లేదా 4 సార్లు సాధారణ దుక్కు చేయాలి. ఆఖరి దుక్కులో ఎకరానికి 10 టన్నుల పశువుల పెంట, 300 కిలోల వేప పిండి, 100 కిలోల సూపర్ పాస్ఫేట్, 10 కిలోల జింకు సల్ఫేట్, రెండు కిలోల గ్రాన్యుబోర్, 100 కిలోల శుద్ధిచేసిన ట్రైకోడెర్మా, 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ వేయాలి. తరువాత నేలలో మట్టి పెళ్లలు లేకుండా చదును చేసుకుని విత్తనాలు విత్తుకోవాలి. ఈ సస్యరక్షణ చర్యలతో చీడపీడల నివారణతో పాటు మంచి దిగుబడులు సాధించవచ్చు.

సస్యరక్షణ చర్యలు కీలకం



ఆకుకూరలు, కూరగాయల పంటలకు సస్యరక్షణ చర్యలు ఎంతో కీలకం. పురుగు మందులు తక్కువ మోతాదులో మాత్రమే వాడాలి. పేనుబంక, ఆకు తినే గొంగళి పురుగుల నివారణకు రెండు మిల్లీలీటర్ల మలాథియాన్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా వేప సంబంధిత పురుగుల మందులను వినియోగించుకోవాలి. ఆకుమచ్చ తెగులు (సర్కోస్పర మచ్చ) నివారణకు మూడు గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పురుగు మందు పిచికారీ చేసిన తర్వాత కనీసం పది రోజుల వ్యవధి ఇచ్చి ఆకుకూరలు కోయాలి.

– కె.దివ్యశ్రీ, ఉద్యానవన శాఖ అధికారి, ప్రత్తిపాడు

సమస్యల పరిష్కారానికే పీజీఆర్ఎస్

తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు



గోకవరంలో అర్జీలు స్వీకరిస్తున్న జేసీ చిన్నరాముడు

గోకవరం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి పీజీఆర్ఎస్ దోహదపడుతుందని తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, జిల్లా సర్వే అధికారి బి.లక్ష్మీనారాయణ, డీఎంఅండ్ హెచ్ఓ కె.వెంకటేశ్వరరావు, ఇతర అధికారులతో కలసి పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కార కోసం జిల్లా, డివిజన్, మండలస్థాయిలో నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గోకవరం పీజీఆర్ఎస్‌లో భాగంగా ప్రజల నుంచి 69 అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలు 1100 నంబర్‌కు ఫోన్ చేసి అర్జీ ప్రస్తుత స్థితిగతులను తెలుసుకోవచ్చన్నారు. అలాగే వాట్సాప్ గవర్నెస్ నంబర్ 9552300009 ద్వారా ప్రజలు పౌర సేవలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.సాగర్, ఎంపీడీఓ ఎం.గోవిందు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు అధికారులు డుమ్మా

గండేపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు అధికారులు డుమ్మా కొట్టారు. మండలంలోని 14 ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పీజీఆర్ఎస్‌కు హాజరు కావాల్సి ఉండగా 10 మంది హాజరయ్యారు. నాలుగు శాఖలకు చెందిన అధికారులు గైర్హాజరయ్యారు. అధికారులు గైర్హాజరు కారణంగా ఫిర్యాదుదారులు ఇబ్బంది పడ్డారు. ఏమి చేయాలో తెలియక వెనుతిరిగారు. ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నామని కూటమి ప్రభుత్వం చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ప్రజలు కష్టాలు మాత్రం తీరడం లేదు. గ్రామాల్లో అధికారుల అలసత్వం కొట్టుచ్చినట్టు కనిపిస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చంద్రబాబు మోసంపై ఇంటింటా ప్రచారం



కేఓ.మల్లవరంలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

తుని రూరల్: మండలంలోని కేఓ మల్లవరంలో సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డొంక వెంకట బెనర్జీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన 143 హామీలు గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజలను నమ్మించి మోసం చేసిందని, మరోసారి మోసపోవద్దని సూచించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను ఓడించి తమ నిరసనను తెలియజేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఇంటింటా పర్యటనలో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి చింతల వెంకటరమణ, తుని నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు అన్నంరెడ్డి వీర్రాఘవులు, యూత్ అధ్యక్షుడు లోవకరవు అప్పలనాయుడు, మండల జనరల్ సెక్రటరీ అంకంరెడ్డి దొరబాబు, మాజీ సర్పంచ్ ఏకా కన్నయ్య, సీనియర్ నాయకుడు చిటికెల వరహాలబాబు పాల్గొన్నారు.

150 మందికి బంగారు రూపుల పంపిణీ



లక్కీ డ్రాలో బంగారు రూపులు గెలుపొందిన మహిళలతో శ్రీనివాస్‌రావు, పద్మావతి దంపతులు

గోకవరం: మహిళల్లో హైందవ చైతన్యం తీసుకురావడమే బంగారు వరలక్ష్మి కానుక ముఖ్య ఉద్దేశమని విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు అన్నారు. గోకవరం సూర్య ఫంక్షన్ హాలులో సోమవారం బంగారు వరలక్ష్మి కానుక-3 కార్యక్రమం నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. డ్రాలో గెలిపొందిన 150 మంది మహిళలకు ఉచితంగా బంగారు రూపులను కంబాల శ్రీనివాసరావు, పద్మావతి దంపతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ గోకవరం మండలం అధ్యక్షుడు ఇనకోటి బాపన్న దొర, వరసాల ప్రసాద్, బత్తుల నానాజీ, డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



విజేతలతో శ్రీప్రకాష్ విద్యాసంస్థల అధినేత నరసింహారావు

తుని: జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు స్థానిక శ్రీప్రకాష్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 25 నుంచి 27 వరకూ తెలంగాణలోని కరీంనగర్ వివేకానంద రెసిడెన్షియల్ స్కూల్లో సీబీఎస్ఈ క్లస్టర్-7 కబడ్డీ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో అండర్-14, 19 విభాగాల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారు. విజేతలకు బంగారు పతకాలతో పాటు రూ.10 వేల చొప్పున నగదు బహుమతులు అందజేశారు. విజేతలు సెప్టెంబర్ 13 నుంచి 16 వరకూ బీహార్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. సోమవారం స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థలో అభినందన సభ నిర్వహించారు. విద్యాసంస్థల అధినేత నరసింహారావు, కార్యదర్శి విజయ్‌ప్రకాష్ విజేతలను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీవీఎస్ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ అపర్ణ, కోచ్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

రౌతులపూడి: సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని రౌతులపూడి ఎస్ఐ వెంకటేశ్వరరావు సూచించారు. మండలంలోని ములగపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం అసాంఘిక కార్యక్రమాలు, సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ నివారణ, ఈవ్ టీజింగ్‌పై విద్యార్థులను చైతన్య పరిచారు. సామాజిక మాధ్యమాల ద్వారా యువత పెడదోవ పట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహిళల భద్రత, బాలికా సంరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని సూచించారు.

దోపిడీ వర్గాలకే కొమ్ము కాస్తున్న కూటమి

లిబరేషన్ పొలిట్ బ్యూరో సభ్యుడు శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న పొలిట్ బ్యూరో సభ్యుడు శంకర్

ప్రత్తిపాడు: బడుగు బలహీన వర్గాల సంక్షేమాన్ని వదిలిపెట్టి, దోపిడీ వర్గాలకే కూటమి ప్రభుత్వం కొమ్ము కాస్తోందని సీపీఐ (ఎంఎల్) పొలిట్‌బ్యూరో సభ్యుడు వి.శంకర్ ఆరోపించారు. ప్రత్తిపాడు లయన్స్‌క్లబ్ కమ్యూనిటీ హాలు ఆవరణలో సోమవారం సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ కార్యదర్శుల జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీహార్‌తో పాటు అనేక రాష్ట్రాల్లో తమకు వ్యతిరేకంగా ఉన్న గ్రామిక, మైనార్టీ, ఆదివాసీ ప్రజల ఓట్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించి, ఎన్నికల్లో గెలిచేందుకు బీజేపీ కుయుక్తులు పన్నుతోందన్నారు. రాష్ట్ర ప్రజలను నమ్మించి చంద్రబాబు మోసగిస్తే, పవన్‌కల్యాణ్ తనను గెలిపించిన నియోజకవర్గంలో కనుమరుగయ్యాడని ఎద్దేవా చేశారు. లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రాజు మాట్లాడుతూ బీహార్‌లో నితీష్ కుమార్ ఏవిధంగా బీజేపీకి సహాయ పడ్డాడో అదే విధంగా రాష్ట్రంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ బీజేపీ సహకరిస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యంపై నమ్మకం లేని కూటమి శక్తులను ఎక్కడున్నా తరిమికొట్టాలని బుగత బంగార్రాజు పిలుపునిచ్చారు. జిల్లాలోని ప్రత్తిపాడు, పిఠాపురం, ఏలేశ్వరం, రౌతులపూడి, గోకవరం, ఉప్పాడ కొత్తపల్లి, జగ్గంపేట తదితర మండలాల్లో నెలకొన్న సమస్యలను పార్టీ బ్రాంచ్ కార్యదర్శులు వివరించారు. లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు, పార్టీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఉదయ్‌కిరణ్, లిబరేషన్ అనుబంధ సంస్థల రాష్ట్ర కమిటీ నాయకులు గొడుగు సత్యనారాయణ, మానుకొండ లచ్చబాబు, రేచుకట్ల సింహాచలం, కె.జనార్దన్, వేమన, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

'కంటిపూడి సుజుకీ' ప్రారంభం



షోరూమ్ ప్రారంభిస్తున్న సర్వరాయుడు

తుని: పట్టణంలో కంటిపూడి సుజుకీవారు నూతన శాటిలైట్ డీలర్‌షిప్ షోరూమ్‌ను కంటిపూడి గ్రూప్ ఆఫ్ కంపెనీ అధినేత సర్వారాయుడు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్వారాయుడు మాట్లాడుతూ కస్టమర్లకు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమన్నారు. అత్యాధునిక, ఆటోమెటిక్ పరికరాలు కలిగిన వర్క్‌షాప్‌ను రూపొందించామన్నారు. కంటిపూడి ఎండీ కె.వినయ్‌బాబు, ఎం.జగన్, సీహెచ్ సత్యనారాయణమూర్తి, కె.మన్మోహన్‌రామ్, కంటిపూడి సుజికీ జీఎం రాజారావు, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

చారుమజుందార్‌కు ఘన నివాళి



ఏలేశ్వరంలో చారుమజుందార్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న వినోద్‌మిశ్రా శ్రేణులు

ఏలేశ్వరం: చారుమజుందార్ వర్ధంతి సందర్భంగా సీపీఐ(ఎంఎల్) వినోద్‌మిశ్రా పార్టీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. వినోద్ మిశ్రా పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ ఆధ్వర్యంలో స్థానిక వినోద్‌మిశ్రా నగర్‌లో చారుమంజుదార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు ఉద్యమాన్ని బలోపేతం చేసిన చారుమజుందార్‌ను పోలీసులు అన్యాయంగా అంతమొందించారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. చారుమజుందార్ ఆశయాలను కొనసాగించడమే తమ ధ్యేయమన్నారు. కేంద్ర ప్రభుత్వం అండతో వామపక్షాలపై చేస్తున్న దాడులను ప్రజా ఉద్యమాల ద్వారా అడ్డుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో గండేటి నాగమణి, గుమ్మడి పాదాలమ్మ, రెడ్డి ఆనంద్‌పాల్, కందుల వరలక్ష్మి, గూనాపు సాయి, కందుల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: లిబరేషన్ పార్టీ వ్యవస్థాపకుడు చారు మజుందార్ వర్ధంతిని ప్రత్తిపాడులో ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. పార్టీ పతాకాన్ని పతాకాన్ని జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు ఆవిష్కరించారు. చారు మజుందార్ చిత్రపటానికి పొలిట్ బ్యూరో సభ్యుడు వి. శంకర్, రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజా సమస్యలపై చారు మజుందార్‌ను స్ఫూర్తితో పోరాడాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

కార్మికుల ఆకలి కేకలు పట్టవా ?



మహిళలతో కలిసి ఆందోళన నిర్వహిస్తున్న పాటంశెట్టి సూర్యచంద్ర

గోకవరం: కార్మికుల ఆకలి కేకలు కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదని సామాజిక ఉద్యమకారుడు పాటంశెట్టి సూర్యచంద్ర ఆరోపించారు. గత 20 రోజుల నుంచి తమకు రావలసిన 19 నెలల జీతాలు ఇప్పించాలని సత్యసాయి తాగునీటి కార్మికులు సమ్మె చేస్తున్నా వారి ఆకలి కేకలు అధికారులకు వినిపించడం లేదని, ప్రజల తాగునీటి కష్టాలు పాలకులకు కనిపించడం లేదన్నారు. సోమవారం గోకవరం డ్రైవర్స్‌కాలనీలో ఆయన సత్యసాయి కార్మికులు, మహిళలతో కలిసి ఆందోళన నిర్వహించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ పాలకులు, అధికారులు సమస్య పరిష్కారానికి కృషి చేయకుండా కాలయాపన చేస్తే ఆగస్టు 18న 10 వేల మంది మహిళలతో రాజమహేంద్రవరం జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం సత్యసాయి కార్మికుల సమస్యలపై తహసీల్దార్ కార్యాయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో జేసీ ఎస్.చిన్నరాముడుకు ఆయన వినతి పత్రం అందజేశారు. కార్మికులకు జీతాలు చెల్లించాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు.

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

గండేపల్లి: తాళ్లూరులో వేంచేసిన రామలింగేశ్వరస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున పండితులు స్వామివారికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు చేశారు. మెట్ట ప్రాంతంలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

హాస్టల్‌లో జేసీ తనిఖీలు



గోకవరంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు పరిశీలిస్తున్న జేసీ చిన్నరాముడు

గోకవరం: ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూను కచ్చితంగా పాటించాలని తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు సూచించారు. గోకవరంలో ఎస్టీ బాలుర వసతి గృహాన్ని సోమవారం మధ్యాహ్నం జేసీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల మెనూను పరిశీలించారు. మెనూ విషయంలో ఎటువంటి ఫిర్యాదులు లేకుండా సక్రమంగా నిర్వహించడంపై దృష్టి పెట్టాలని సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ కూరగాయలు, ఆకుకూరల స్టాల్‌ను పరిశీలించారు. అలాగే వీరలంకపల్లిలో ప్రకృతి వ్యవసాయం సాగిస్తున్న రామకృష్ణ గార్డెన్స్‌ను సందర్శించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆదర్శ రైతు కొరిపల్లి అప్పలస్వామి ఉన్నారు.

కళలను కాపాడుకోవాలి

గండేపల్లి: కళలు, కళాకారులను కాపాడుకోవాలని తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తుమ్మలపల్లి రమేష్ పేర్కొన్నారు. నీలాద్రిరావుపేటలోని సాయిబాలాజీ ఫంక్షన్ హాల్‌లో సోమవారం సినీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహమణ్యం జాతీయ అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సుమారు వంద మంది కళాకారులకు బహుమతులు అందజేశారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీకాంత్

గోకవరం: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ సూచించారు. మండలంలోని కొత్తపల్లి ఆదర్శ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులకు సోమవారం మత్తు పదార్థాల నివారణ, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నేటి యువత మానసిక ఒత్తిడి, తోటి వారి ప్రభావంతో డ్రగ్స్‌కు బానిసలవుతున్నారన్నారు. యువత ఈ చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మంచి లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం కోరుకొండ సీఐ వై.సత్యకిశోర్, గోకవరం ఎస్సై పవన్‌కుమార్ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ పి.కనకరాజు, కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా

కిర్లంపూడి: డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన తొమ్మిది మందికి కోర్టు జరిమానా విధించినట్టు జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ సోమవారం తెలిపారు. మండల పరిధిలోని గ్రామాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని ప్రత్తిపాడు కోర్టులో హాజరుపరిచారు. జడ్జి ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున రూ. 90 వేల జరిమానా విధించినట్టు సీఐ తెలిపారు.

ప్రకృతి పరిరక్షణ అందరి బాధ్యత

జగ్గంపేట: ప్రకృతి పరిరక్షణ అందరి బాధ్యత అని పలువురు వక్తలు అన్నారు. మండలంలోని జె.కొత్తూరులో సోమవారం హ్యాపీ చిల్డ్రన్స్ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ నకిరెడ్డి నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

గోకవరం: గ్రామంలోని పలువురు బాధితులకు సోమవారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో 25 మందికి రూ.14.81 లక్షల విలువైన చెక్కులు అందజేశారు. జగ్గంపేట నియోజవర్గంలో ఇప్పటివరకు 350 మందికి చెక్కులు పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గాజింగం సత్తిబాబు, జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్‌బాబు, మంగరౌతు రామకృష్ణ, కన్నబాబు, ఉంగరాల రాము తదితరులు పాల్గొన్నారు.